రైతుల సంత.. స్టాళ్ల చింత

పెందుర్తి రైతుబజార్‌లో స్టాళ్ల కొరత

ఆరుబయటే కాయగూరల విక్రయాలు

రైతులు, వినియోగదారుల అవస్థలు



నేలమీదే దుకాణాలు పెట్టుకుని విక్రయిస్తున్న రైతులు



పెందుర్తి రైతుబజార్

గుర్తింపు కార్డులున్న రైతులు	158
సగటున రోజుకు వచ్చే రైతులు	130
అందుబాటులో ఉన్న స్టాళ్లు	90

పెందుర్తి: పెందుర్తి రైతుబజారులో స్టాళ్ల కొరత వేధిస్తోంది. ఇక్కడ వారపు సంతల ప్రభావం ఉన్నా రైతుబజార్‌కు రోజురోజుకూ వినియోగదారుల తాకిడి పెరుగుతూనే ఉంది. రెండుపూటలా బజార్ నడుపుతుండడంతో నిత్యం రద్దీ ఉంటోంది. ఉమ్మడి జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో సాగవుతున్న తాజా కూరగాయలు ఇక్కడకు వస్తుండడంతో వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే, గుర్తింపు కార్డులు ఉన్న రైతులకు తగినన్ని స్టాళ్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరుబయట, నేల మీద కూరగాయలు వేసి అమ్మకాలు జరపాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఎండలకు..వర్షాలకు అవస్థలు పడుతున్నారు.

300–350 క్వింటాళ్ల విక్రయాలు

రైతుబజార్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 మండలాల నుంచి 51 గ్రామాలకు చెందిన రైతులు తమ కాయగూరల ఉత్పత్తులను అమ్మకాలు జరుపుతున్నారు. మొత్తం 158 మంది రైతులకు గుర్తింపు కార్డులు ఉండగా సగటున రోజుకు 130 మంది వరకు వస్తారు. జిల్లా వ్యాప్తంగా పండే పంటలను 300–350 క్వింటాళ్ల వరకు రోజుకు ఇక్కడ విక్రయాలు జరుగుతాయి. సగటున ఉదయం/సాయంత్రం 4 వేల మంది వినియోగదారులు ఇక్కడకు వచ్చి కూరగాయలు/ఆకుకూరలు కొనుగోలు చేస్తున్నారు. ఆకుకూరలకు పెట్టింది పేరైన పెందుర్తి మండలంతో పాటు గిరిజన ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడకు వచ్చి తమ ఉత్పత్తులు అమ్ముతున్నారు. గిరిజన ప్రాంతంలో బీన్స్, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి ఇక్కడికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

కిందనే అమ్మకాలు

మొత్తం 80 సెంట్ల స్థలంలో నిర్మించిన రైతుబజార్‌లో ప్రస్తుతం 90 స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో నిబంధనల ప్రకారం గిరిజనులకు 8, వికలాంగులకు 3, ఆకుకూరలకు 8, డ్వాక్రా సంఘాలకు 9, సూపర్‌బజార్‌కు 2, నిమ్మకాయలకు 2, కోడిగుడ్లకు 1, ఇతరత్రా అవసరాలకు 5 కౌంటర్లు శాశ్వతంగా కేటాయించారు. ఈ క్రమంలో రైతులకు 52 స్టాళ్లు మాత్రమే మిగిలాయి. కాగా ఉదయం బజారుకు సగటున రోజుకు 75 నుంచి 85 మంది రైతులు వస్తుంటారు. సాయంత్రం 30 నుంచి 40 మంది వస్తారు. ఈ క్రమంలో ఉదయం కాయగూరలు తీసుకువచ్చే రైతులు ఇక్కడ స్థలాభావంతో ఇబ్బంది పడుతున్నారు. రోజూ దాదాపు 15 నుంచి 20 మంది రైతులకు స్టాళ్లు లేక నేల మీదే విక్రయాలు జరపాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి బజారులో తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.



రైతుబజార్‌లో స్టాళ్లు సరిపడక ఆరుబయట కూరగాయలు అమ్ముతున్న రైతులు

నేల మీదే, ఎండలో కూర్చోవాలి



గతంలో కంటే ప్రస్తుతం వినియోగదారులు పెరిగారు. మేం పండించిన కాయగూరలు మిగలకుండా అమ్ముడవుతున్నాయి. రైతుల కోసం ఇతర సౌకర్యాలు ఎలా ఉన్నా, స్టాళ్లు సరిపడా లేక ఇబ్బందులు పడుతున్నాం. రోజూ పది, పదిహేను మంది రైతులు నేల మీదే ఎండలో కూరగాయలు అమ్ముకోవల్సి వస్తోంది. అధికారులు స్పందించి మా సమస్య పరిష్కరించాలి.

– డి.లక్ష్మి, వారాడ, కె.కోటపాడు మండలం

కూరగాయలు పాడవుతున్నాయి



మా బజార్‌లో స్టాళ్ల కొరత వలన చాలా ఇబ్బంది పడుతున్నాం. రైతులు ఎక్కువ, స్టాళ్లు తక్కువ ఉండడం వలన ఇక్కడి అధికారులు కూడా సర్దుబాటు చేయలేకపోతున్నారు. దీంతో వినియోగదారులు నడిచే ప్రాంతంలో కూరలు వేసి అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి. దీంతో ప్రాంగణం ఇరుకుగా మారడంతో పాటు వినియోగదారుల కాళ్లు తగిలి కూరగాయలు పాడవుతున్నాయి. వర్షాల సమయంలో అయితే నరకం చూస్తున్నాం.

– శరగడం శ్రీను, గవరపాలెం, పెందుర్తి మండలం

ప్రత్యామ్నాయం కోసం ప్రతిపాదనలు



బజార్‌లో బినామీలను, మధ్యవర్తులను పూర్తిగా ఏరేశాం. రైతులకు ఉన్నంతలో సౌకర్యాలు కల్పించాం. రాత్రి బజార్ కూడా ఉండడంతో సరిపడినంత విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేశాం. చెత్తరహితంగా బజార్‌ను చేసేందుకు స్టాళ్ల వద్ద చెత్తబుట్టలు పెట్టాం. అయితే రైతులకు సరిపడా స్టాళ్లు లేకపోవడం వాస్తవమే. స్థలం సరిపడా లేకపోవడం వలన స్టాళ్లు పెంచే పరిస్థితి లేదు. ఉన్నవాటినే రైతులకు సర్దుబాటు చేస్తున్నాం. ప్రత్యామ్నాయం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు చేశాం.

– వి.ఎస్.పి. షర్మిల, ఎస్టేట్ అధికారి, పెందుర్తి రైతుబజార్

సీతారాముల కల్యాణానికి రాట



కోట్నివానిపాలెంలో పెళ్లి రాట వేస్తున్న గ్రామస్తులు

పెందుర్తి: శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి కోట్నివానిపాలెం రామాలయం వద్ద శుక్రవారం శాస్త్రోక్తంగా రాట వేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రైల్ విహార్ కాలనీలో..

రామాలయం వద్ద సీతారాముల కల్యాణం కోసం పందిరి, పెళ్లి రాటను శాస్త్రోక్తంగా వేశారు. కాలనీ అధ్యక్షుడు విన్నకోట రాము మాట్లాడుతూ ఆదివారం కల్యాణంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు పి.గోవిందరావు, కె.వి.ప్రసాదరావు, ఎంపీ శ్రీనివాస్, ఎం.వి.ఆర్. పాత్రులు, ధర్మారావు, సదానందం, ఎం.ఎం. శ్రీనివాస్, కృష్ణారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

హెచ్‌ఏడీఆర్ శిక్షణకు డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక



హెచ్‌ఏడీఆర్ శిక్షణకు ఎంపికైన స్నేహలత

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ పందూరి స్నేహలత ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని అమెరికన్ సెంటర్‌లో అమెరికా ఇండియా మానవ సహాయ మరియు విపత్తుల ఉపశమనం(హెచ్‌ఏడీఆర్) శిక్షణ కేంద్రానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి తెలిపారు. ఎన్‌సీసీ నేవల్ విభాగానికి చెందిన డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థిని స్నేహలతను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఎంపికైన క్యాడెట్లకు అమెరికన్ సేవాదళం, భారతీయ సేవాదళం వారి సంరక్షణలో మానవ సహాయ మరియు విపత్తుల ఉపశమనం తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు.

క్లుప్తంగా

నేత్రపర్వం.. అమ్మవారి తిరువీధి ఉత్సవం



అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి శుక్రవారం విశేషంగా తిరువీధి జరిగింది. సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, ఆలయ బేడా మండపంలో వైభవంగా తిరువీధి నిర్వహించారు. హారతి అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీవారికి పంచామృతాభిషేకం



పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. విశేష పూజల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఐదుగురికి కోర్టు రూ.50 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన



చర్చి ఫాదర్ థామస్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్

పెందుర్తి: స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సెయింట్ థెరెసా ఆఫ్ అవిలా చర్చ్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని చర్చి ఫాదర్ థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిబిరంలో పలువురు దాతలు రక్తదానం చేశారు. గాజువాకకు చెందిన వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దాతలకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందించారు. పాస్టర్లు సురేష్, సుభాష్, చారిటీ సభ్యుడు యల్లపు అనిల్‌కుమార్, ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్, సభ్యులు పెతకంశెట్టి ఉమాశంకర్రావు, సిరిమళ్ల గణేష్, కారి సూర్యనారాయణ, పెంటకోట గణేష్, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వి.వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు.

బాధితులకు రూ.2.5 లక్షల పరిహారం

విశాఖ సిటీ: రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇద్దరు బాధితులకు రూ.2.5 లక్షల పరిహారం అందజేశారు. ఇటీవల హిట్ అండ్ రన్ ప్రమాదంలో మరణించిన నాగిశెట్టి నూకాలమ్మకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలైన కొట్టన దేవికి రూ.50 వేలు చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 34 మంది బాధితులకు రూ.29 లక్షల పరిహారాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అందించినట్లు సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల బాధితులు సహాయ కేంద్రంలో గానీ, టోల్‌ఫ్రీ నంబర్ 7995095793లో గానీ సంప్రదించాలని సూచించారు.

సింహాచలం బస్ కాంప్లెక్స్‌లో టాయిలెట్ల ఆధునికీకరణ



టాయిలెట్ల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం అప్పలనాయుడు

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఆధునికీకరించిన టాయిలెట్ల సముదాయాన్ని శుక్రవారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు వాటిని ప్రారంభించారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ఆర్‌ఎం అప్పలనాయుడు చొరవతో టాయిలెట్లను ఇటీవల ఆధునికీకరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ బస్‌కాంప్లెక్స్ ఏరియాను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇక్కడి పార్సిల్ సర్వీస్‌ను స్థానికులు, ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు. శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 5, 6 తేదీల్లో ద్వారకా బస్‌స్టేషన్ నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. ఈ నెల 30న సింహాచలంలో జరిగే చందనోత్సవం సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఆరోజు బస్సులకు ఎలాంటి రిపేర్లు లేకుండా చూసుకోవాలని మెకానికల్ సిబ్బందికి, డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో సింహాచలం డిపో మేనేజర్ కె.రాజశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహారావు, అసిస్టెంట్ ఇంజినీర్ కొండలరావు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కరకచెట్టు పోలమాంబ రాటోత్సవం



రాటోత్సవంలో దేవస్థానం సభ్యులు, భక్తులు

బీచ్‌రోడ్డు: పెద్దవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిరి రాట ఉత్సవం ఘనంగా జరిగింది. ముందుగా రాటతో దేవస్థానం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణ చేశారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ రాట వేశారు. ఈ సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఆలయ ఈవో కె.గాయత్రి మాట్లాడుతూ పోలమాంబ జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. శుక్రవారం నుంచి మే 6 వరకు వార్షిక జాతర జరుగుతుందన్నారు. ఈ నెల 6న పండగ చాటింపు, 7న దేవర పండగ(పుట్టబంగారం), 14న తొలేళ్లు, 15న అనుపు ఉత్సవం, 22న మారువారం, 26న మహా అన్నదానం నిర్వహిస్తామని వెల్లడించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నామని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని, ఎండల దృష్ట్యా తాగునీరు, మజ్జిగ వంటివి పంపిణీ చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికుల సహకారంతో ఉత్సవాలు జయప్రదం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 14న సోమవారం రాత్రి 10 గంటల నుంచి 14 గ్రామాల ఆరాధ్య దైవం పోలమాంబకు తొలి పూజ జరుగుతుందని, పాల్గొనే భక్తులు దేవస్థానంలో రూ.2 వేల చెల్లించాలని చెప్పారు. అనంతరం ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌తో తక్షణ ఉపాధి



విద్యార్థులతో మాట్లాడుతున్న గైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: టెన్త్ అనంతరం పాలిటెక్నిక్ విద్య అభ్యసించడం ద్వారా తక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ (గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇనిస్టిట్యూట్ (గైస్)లో పదో తరగతి విద్యార్థులకు పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులు శుక్రవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మంచి డిమాండు ఉందని పేర్కొన్నారు. పాలిసెట్‌కు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో మంచి ర్యాంకు రావాలంటే పాఠ్య పుస్తకాలపై ఆధారపడాలన్నారు. మెటీరియల్ కేవలం ఒక మార్గదర్శిగానే ఉపయోగపడుతుందన్నారు. పదో తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు, పాత పరీక్ష పేపర్లు ప్రాక్టీసు చేయాలన్నారు. పాలిటెక్నిక్ కోర్సును మూడేళ్లు అభ్యసించాల్సి ఉంటుందన్నారు. కెమికల్ ఇంజినీరింగు, మెటలర్జీ కోర్సులు మూడున్నర సంవత్సరాలు చదవాల్సి ఉంటుందన్నారు. వీరు కోర్సు మధ్యలో ఏడాది పాటు ఇండస్ట్రియల్ ట్రైనింగ్ పొందుతారని, ఇతర విభాగాల కోర్సుల్లో ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం రూపొందించిన స్టడీ మెటీరియల్ అందించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సరిపల్లి విద్యార్థుల అ'ద్వితీయ' ప్రతిభ



తోటగరువు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమంలో సరిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారు రూపొందించిన 'యాన్ ఇన్నోవేషన్ ఇన్ డ్రైనేజ్ క్లీనింగ్' ప్రాజెక్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది.

డీసీసీబీలో కారుణ్య నియామకం



అజిత్‌కుమార్‌కు నియామక ఉత్తర్వులు అందిస్తున్న జేసీ, బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్

మహారాణిపేట: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో కారుణ్య నియామకం జరిపారు. ఎంబీసీహెచ్ఎస్ అజిత్ కుమార్‌కు శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్, బ్యాంకు పర్సన్–ఇన్‌చార్జి మయూర్ అశోక్ డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ సమక్షంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. డీసీసీబీ మధురవాడ బ్రాంచ్‌లో మెసెంజర్‌గా పని చేస్తున్న మాదు రాంబాబు అకాల మరణం పొందారు. అతని కుమారుడు ఎంబీసీహెచ్ఎస్ అజిత్ కుమార్‌కు విద్యార్హతలు పరిగణనలోకి తీసుకుని నిబంధనలకు లోబడి ఉద్యోగం ఇవ్వాలని గత నెల 26న జరిగిన బ్యాంకు మహాజన సభలో తీర్మానించారు. ఇప్పుడు బ్యాంకులో 5వ కేటగిరీ ఉద్యోగిగా కారుణ్య నియామక ఉత్తర్వులు ఇచ్చారు.

శ్రీసూర్యారాధన పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు

సీతంపేట: విశాఖ సాహితీ 54వ వ్యవస్థాపక దినోత్సవం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం జరిగింది. ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి రచించిన శ్రీ సూర్యారాధన , దేవాలయాలు అనే పుస్తకాన్ని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఆరోగ్య సమతుల్యానికి సూర్య భగవానుడు ఎంతో మేలు చేస్తుంటాడని, అటువంటి సూర్య భగవానుడుకి సంబంధించిన విషయాలను పాండురంగ విఠల్ చాలా పరిశోధన చేసి ఒక మంచి పుస్తకాన్ని రచించారని కొనియాడారు. ఒక సాహితీ సంస్థ 54వ వ్యవస్థాపక దినోత్సవం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఇన్నేళ్లు మనుడగ సాగించడం చాలా గొప్ప విషయమన్నారు. ఘండికోట విశ్వనాథం పుస్తక సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి వై.వి.అనూరాధ, విశ్రాంత పోలీస్ అధికారి శ్రీరంగం దివాకర్, విశాఖ సాహితీ అధ్యక్షురాలు కోలవెన్ను మలయవాసిని, కార్యదర్శి శంకర్ నీలు, ఉపాధ్యక్షుడు డి.వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న యువత ఓటు నమోదు చేసుకోవాలి

ఈఆర్వో శేషశైలజ



మాట్లాడుతున్న ఈఆర్వో శేషశైలజ

పెందుర్తి: ఓటు నమోదు ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుందని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు తమ ఓటు నమోదు చేయించుకోవాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.శేషశైలజ సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రాజకీయ పక్షాలతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కలిగించాలన్నారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు నమోదు చేయించుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. జీవీఎంసీ పరిధిలో వార్డుల్లోని ఓటర్లు తమ పోలింగ్ బూత్‌లు మార్చుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. నాయకుల సలహాలు సూచనలు తీసుకున్నారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజా నాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని వారం రోజుల పాటు రాజ్యాంగ పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సీపీఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 5న బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజు నుంచి వారం రోజుల పాటు కళా ప్రదర్శనలు, పాటలు, నృత్యాలు, కోలాటం, తీన్మార్ డప్పులు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 13 ఉదయం 9 గంటలకు దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రం వరకు డప్పు కళాకారులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నామని తెలిపారు. సినీ నటుడు, నిర్మాత, పీపుల్స్ స్టార్ ఆర్. నారాయణమూర్తి పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వై. రాజు, నగర అధ్యక్షుడు టి. చిరంజీవి, ఎంవీ ప్రసాదరావు, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి. రమణ, ఎస్ఎస్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేచర్ క్యాంప్



కంబాలకొండలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో శుక్రవారం తోటగరువు, చంద్రంపాలెం, ఎండాడ, గోపాలపట్నం, సునీల్‌శర్మ కాలనీల పాఠశాలల తోపాటు పలు ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు ఉపాధ్యాయులు నేచర్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులు ఇక్కడ వివిధ వృక్షాలు, ఔషధ మొక్కలు, కొండలు తదితర వాటిని పరిశీలించారు. వాటి గురించి ఉపాధ్యాయులు వివరించారు. జిల్లా ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ రెడ్డి బాబూరావు మాట్లాడుతూ కంబాలకొండలో వివిధ రకాల మొక్కలు, వన్యప్రాణుల గురించి విద్యార్థులు వివరించారు. పర్యావరణంలో వాటి ఆవశ్యకత తెలియజేశారు. అనంతరం ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ముద్రించిన పోస్టర్‌ను విద్యార్థులతో కలసి ఆవిష్కరించారు.